# పాపం ప్రకాశం

రచన: శ్రీమతి ఎస్. కనులకుమారి

సాయంత్రం సుమారు నాలుగున్నర అవుతుంది. దివకరుడు తన ప్రతాపాన్ని చూపడం ఇక సాధ్యం కాదనేమో హిమకరునికి తావిస్తూ తాను తప్పుకుంటున్నాడు. ఆ సమయంలో ఎండ ఎంతో అందంగా, హాయిగా ఉంటుంది.

ప్రకాశ్ చేతిలో పుస్తకం పట్టుకుని పడక కుర్చీలో కూర్చుని కాగితాలు తిరిగేస్తున్నాడు. ఆ వాతావరణం అతనికి చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. పుస్తకం మీద దృష్టి అయితే ఉంది గాని మనసు వేరే విషయాలమీద పరిభ్రమిస్తోందని చూడగానే తెలుస్తోంది. అతనికి ఆలోచలన్నీ జయ చుట్టూ తిరుగుతున్నాయి.

ముందు రోజు సాయంత్రం ఏదో నోట్సుకోసం రఘుతో కలిసి వాళ్ళింటికి వెళ్ళాడు.

వీధి గుమ్మంలో కాలు పెట్టేసరికి ఒక అపురూప సౌందర్యవతి వారపత్రిక చేతబట్టి వయ్యారంగా పేముకుర్చీలో కూర్చుని దీక్షగా చదువుతోంది.

'ఈమె ఎవరు? ఇంతకు ముందెన్నడూ చూడలేదు! ఎవరై ఉంటుంది' అని ఆలోచనలో పడ్డాడు.

అతని సందేహం కనిపెట్టినట్లు 'ఈమె మా సిస్టర్! పేరు జయలక్ష్మి! ఇన్నాళ్ళు మా చినాన్నగారింట్లో ఉండి పి. యు. సి. వెలిగించి ప్రస్తుతం వీక్లీలు, మంత్లీలు బట్టడమే ఉద్యోగం'! అన్నాడు రఘు.

'ఓహో! అలాగా నమస్కారం!

'నమస్కారం! అంటూ మెరుపు తీగెలా ఆమె లోనికి వెళ్ళిపోయింది.

---

బురదలో పుట్టిన పంకాన్ని. మీరు దేవుడు శిరస్సు నలంకరించారు అంది సుందరి. అన్నీ బిరుదులే!...భరించలేను!...కొన్ని తిట్లు తిట్టు! అన్నాడు నవ్వుతూ.

'అబ్బె! పూరుకుందురూ! నాదైవం మీరు! అలాచేస్తే కళ్లుపోతాయి! అంది!

నిజం! అంటూ దగ్గరికి లాక్కోబోయాడు. 'తప్పయిది రిక్షా అని చుట్టూ చూపింది సుందరి.



10 ని॥ అనంతరం, 'తీసికోండి' అంటూ రెండు కాఫీ కప్పులతో ప్రత్యక్షమయింది!

'థ్యాంక్స్' ప్రకాశం.

'నో మెన్షన్' జయ.

ఇంతకీ వీడిని నాకు పరియం చేయలేదు కదూ? నా క్లాస్‌మేట్ లే! పేరు ఏదో చాలా పెద్దదిగాని, చివరికి మిగిలేది ప్రకాశం అని, మాత్రమే! చదువులో కాలేజీ ఫస్టు, ఇక పరీక్షలకి మాకు గురుత్వం వహిస్తారు అంటే నాచేత పాఠాలు బట్టీ పట్టిస్తాడన్నమాట!

'అమ్మయ్య! అయిందా ఉపన్యాసం. పాపం అలసిపోయావు ఈ కప్పు కాఫీ కూడ తాగేయి. అంతగా అయితే నే నేదే హోటల్‌లో తాగుతాలే' నవ్వుతూ అన్నాడు ప్రకాష్!

మునిముసిగా నవ్వుతూ లోనికి వెళ్లిపోయింది. జయ.

* * * *

నోట్సు తీసికుని ఇంటికి చేరిన ప్రకాశం ఇంకా ఆ అందమైన జయ గురించే ఆలోచిస్తున్నాడు. ఎంత అందమైన ముఖం! సన్నని నడుము, సన్నగా నాజూగ్గా పాలరాతి విగ్రహంలా ఉండే జయని చూస్తే ఎటువంటి వారికైనా మనసు చలిస్తుందేమో? అనుకుంటున్న ప్రకాశానికి 'అటువంటి ఆలోచనలు నీకు తగవు, నీ పరిస్థితి మరిచావా?' అంటూ మనసు హెచ్చరించింది. ప్రకాశం సామాన్య కుటుంబం. తల్లీ రాజమ్మ, చెల్లెలు లలిత, అనికిసునికి ఇద్దరు తమ్ములు ఉన్నారు. కొడుకు పరీక్ష పాసై తనని ఉద్ధరిస్తాడని ఆ తల్లి ఆశ,

ఎస్. ఎల్. సి. పాసయిన లలిత ఇరుగు పొరుగువారి బట్టలుకుట్టి, ఆ వీధిలో నలుగురికి ప్రైవేటు చెప్పి కొంత సంపాదిస్తుంది. తండ్రి మరణించాక అతని నిజాయితీని గుర్తుంచుకుని కొంత డబ్బు ఆదనంగా ఇచ్చాడు యజమాని, ఆ డబ్బు బ్యాంకిలో వేసి, ఆ వచ్చే వడ్డీ డబ్బుతోటి, తను సంపాదించే దానితోటి క్లుప్తంగా సంసారం సాగిస్తున్నారు వాళ్లు. అదీ కాక తన చదువు, తన తమ్ముళ్ళ చదువులు ఇవన్నీ గుర్తుకి వచ్చిన ప్రకాశం అన్యమనస్కంగానే పక్క చేరాడు.

* * * *

మర్నాడు ప్రకాశ్ భోంచేస్తుంటే తల్లి ప్రక్కనే వచ్చి కూర్చుంది.

'ఏంటమ్మా విశేషం!' తల్లి పని లేకపోతేగాని ఆ సమయంలో అలా రాదని తెలుసు.

ఒరే! పాపం లలిత ఇంటెడు చాకిరీ చెయ్యలేక పోతున్నాది! నేనో ముసలయి మూల కూర్చున్నా!

'అయితే నేను రేపట్నించి వంట మొదలెట్టనా?

'అదేం మాటలురా! అయినా మెంగ మహారాజువి నీకేం ఖర్మ?'

'ఇంతకీ నేనేం చేయను?' కాస్త విసుగు ధ్వనించింది ప్రకాశం మాటలో!

'నే చెప్పనా అన్నయ్యా? అసలు సంగతి! అమ్మకేమో కోడలు కావాలట!' బ్రహ్మచారి ముదిరినా-

బెండకాయ ముదిరినా లాభం లేదురా!

అబ్బో! నామాట విని ఏదో సంబంధానికి ఒప్పుకో?..

'అమ్మా! ఇంట్లో నా చెల్లెల్ని ఉంచుకుని నేను పెళ్లి చేసుకుంటే నలుగురూ నవ్వరా? ఇంతకీ పరీక్షలు ఇంకా కాలేదు! ఏ సంగతీ ఏమవుతుందో తెలీదు! ఉద్యోగం సద్యోగం లేదు! అయినా ముందు లలిత పెళ్లి కావాలి! తరవాతే నా పెళ్ళి ఊసుఎత్తు'

తన పెళ్ళిమాట అన్న ఎత్తగానే కాస్త అన్నం పెట్టమ్మా అన్న, అన్నమాట వినకుండానే తుళ్లుతుంది లలిత.

తల్లీ కొడుకులు ఆ పిల్లని చూసి నవ్వుకున్నారు. అంతటితో ఆ ప్రశక్తి ఆగిపోయింది.

*　　*　　*　　*

ఆనాటి జయ పరిచయం తర్వాత చదువు మిషతో తరచుగా వాళ్ళింటికి రాకపోకలు సాగించేవాడు ప్రకాష్.

రఘు, ప్రకాష్‌లు పోటీ పడి చదువుతూంటే వాళ్ళకి టీలు, టిఫిన్‌లు అందిస్తూ అక్కడక్కడే తిరుగాడుతుండేది జయ.

ఆ సంగతి గమనించీ గమనించనట్లు ఉండేవాడు రఘు.

కాని ప్రకాష్ మనసులో మళ్ళీ సంచలనం చెలరేగేది. జయ గొప్పింటి పిల్ల. నేను సామాన్యుడిని. నన్ను జయ వివాహం చేసుకుంటుందా? ఒకవేళ చేసుకున్నా తన తల్లినీ చెల్లినీ గౌరవంగా చూడగలదా?

'ఓకే నాయనా! ప్రకాశం! ఏ లోకంలో ఉన్నావు. నా దీనాలాపన విన్పించుట లేదా? నీ గొంతులో చేరడం కోసం ఈ టీ తహతహ లాడుతోంది' అని రఘు అరుస్తే ఉలిక్కిపడేవాడు.

తరచుగా ఇలాంటి సంఘటనలు జరుగుతూండేవి!

పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. ఇక యిలాగయితే ఫెయిలవడం ఖాయం! కష్టపడాలి అని ఇద్దరూ శ్రద్ధగా చదవడం ప్రారంభించేరు.

ఎదురుచూసిన పరీక్షలు రావడం, వెళ్ళడం జరిగాయి. ఇక ఫలితాలకై ఎదురు చూడటం ప్రారంచేరు.

వీధిలో నించే హడావిడిగా వచ్చి తల్లి కాళ్ళని నమస్కరించాడు ప్రకాష్!

'సుఖీ భవ! ఏ సంగతి!'

'నేను పాసయ్యానమ్మా?'

'ఓస్! అంతేనా! ఇంకా ఏమో అనుకున్నా! దానికేనా హడావిడి' అంటూ లలిత దీర్ఘం తీసింది!

'ఏయే! పిల్లా ఏమన్నావే! నేను పాసయ్యాను! ఊరికినే కాదే ఫస్టుక్లాసులో! తెలిసిందా! ఈ కాలంలో బి. కాం. ఫస్టుక్లాసులో పాసవడమంటే నువ్వు ఎస్సెల్సీ పాసవడం అనుకున్నావా?'

లేదురా బాబూ! నువ్వు చాలా గొప్పవాడివి!

మరి ఇదిగో నీకు ప్రెజెంటేషన్' పకోడీలప్లేటు అందిస్తూ ఎఱ్ఱబారిన చెవినీ తడుముకుంది లలిత.

'థ్యాంక్యూ! రఘు దగ్గరకి వెళ్ళొస్తానమ్మా! లల్లీ టా! టా!

*　　*　　*　　*

'రఘూ! ఓ రఘూ!'

'ఎవరూ! మీరా రండి రండి! ఫస్టుక్లాస్ కొట్టేశారే! కంగ్రాచ్యులేషన్స్! అరె! అలా నిల్చునే ఉన్నారేం? కూర్చోండి' అంది జయ కుర్చీ ముందుకు జరుపుతూ.

'థాంక్స్!' ఇంతకీ......'

'రఘు లేడు! చుట్టాలొస్తే వాళ్ళని తీసుకుని అందరూ సింహాచలం వెళ్ళేరు! ప్రస్తుతం మనం-ఐమీన్ నేను ఈ ఇంటికి చౌకీదారుని!!

'అలాగు! అయితే నే వస్తాను,'

'అదేమిటండీ! ఎవరూ లేకపోతే ఇక లోనికి రారా? మరేం ఫర్వాలేదు రండి! కూర్చోండి.

'సరే! ఈ మేగజీను చూస్తూ ఉండండి. నే ఇప్పుడే వస్తాను.' అనీ లోనికి వెళ్ళిన జయ రెండు మైసూర్ పాక్ పెట్టిన ప్లేటుతో వచ్చింది.

'అబ్బే! ఇవన్నీ ఎందుకండీ శ్రమపడ్డారు అనవసరంగా!'

'మంచివారే డబ్బాలోవి ప్లేటులోపెట్టి తేవడం శ్రమా! పోనీ మా అన్నయ్య పరీక్ష పాసయినందుకు పార్టీ అనుకోండి!'

'థాంక్స్' ప్లేటు అందుకుని చిన్న మైసూర్ పాక్ ముక్క కొరుకుతూ 'అయితే మీ పార్టీ ఎప్పుడో!' ప్రకాశ్ చిన్నగా నవ్వుతూ అడిగాడు.

'నాపార్టీయా'! గాభరా పడింది జయ.'

'అదే నండీమీ పెళ్లి పార్టీ'

'ఓ! అదా! తేలికగా నవ్వేస్తూ ఏదో అనబోయిన జయ.

'రఘూ' అన్న పిలుపు విని ఆగి, బయటకి వెళ్ళింది. వెనకనే ప్రకాశ్ కూడా వెళ్ళాడు.

'హలో! ఆనంద్' ఎక్కడికి ప్రయాణం?'

'అలా బజారుకి వెళ్ళాలనుకుంటున్నా! వస్తావా?'

'జయా! రఘు వస్తే నేను వచ్చి వెళ్ళానని చెప్పు!' పదరా అంటూ ఆనంద్‌తో కలిసి వెళ్ళిపోయాడు ప్రకాశం.

అలా వెళ్ళిన ప్రకాష్‌ని చూస్తూ చిన్నగా నవ్వుకుంది జయ!

* * * *

రఘు గదిలో వాలు కుర్చీలో కూర్చుని ఏదో డిటెక్టివ్ చదువుతున్నాడు.

'అన్నయ్యా! ఓ అన్నయ్యా'! తుఫానులా రయ్యమని తలుపు తోసుకువచ్చిన జయని చూడగానే కయ్యమన్నాడు రఘు.

'నీ కెన్ని సార్లు చెప్పాలి! నెమ్మదిగా ఉండమని! కాసేపు ప్రశాంతంగా చదువుకో నివ్వవు గదా! అబ్బబ్బ కాకిలు ఒకటే అరుపులు.' గబగబా చొక్కా తీసివేసుకోబోతూ, కళ్ళనిండా నిండిన నీరు బుగ్గంమీదుగా జారిపోతుంటె చేలమొగం వేసుకున్న జయని చూసి చెప్పగా చల్లారి పోయేడు.

''కోపం వచ్చిందా జయా! సారీ_ఎక్స్క్యూస్ మి అ... ఆ... ఇంతకీ ఎందుకా హడావిడి...' అన్నాడు చొక్కా తిరిగి హేంగర్‌కి తగిలిస్తూ.

బుంగమూతి పెట్టిన జయ ఉలకలేదు పలకలేదు.

'ఏమిటీ! నీ కింతకోపం ఎప్పట్నించీ! అయితే నాతో మాట్లాడవూ?' అంటూ గడ్డం ఎత్తి కన్నీళ్ళు తుడిచాడు.

'మరేం... నేను... నేను పరీక్ష పాసయ్యాను' వెక్కిళ్లు దిగమింగుతూ చెప్పింది. జయ.

'అరె! ఇంత మంచివార్త తెచ్చిన నిన్ను తిట్టేనా! సరే! ప్రజెంటేషన్ ఏం కావాలి?' కోరుకో అన్నాడు.

'అడగనా' అన్నట్లు చూసింది జయ!

'చెప్పవోయ్! బెట్టు చాలించి' అన్నాడు రఘు.

'అయితే! ప్రకాష్‌మీద నీ అభిప్రాయం ఏమిటి?' జయ అడిగింది.

'ఏం? ఎందుకు? నిన్నేమైనా అన్నాడా? అలాంటి వాడు కాదే నాకు తెలిసినంత మట్టుకి! ఇంతకీ......

'లేదన్నయ్యా! నన్నెవరూ ఏమీ అనలేదు. నేనే...'

'అహా! అదా సంగతి! అర్థమయ్యిందిలే! సరే నేను అందరితో మాట్లాడుతాను! దీని బాధ్యత నాది సరా! పిచ్చిపిల్లా! అన్నాడు తలనిమురుతూ.

'అన్నయ్యా!' ఆశ్చర్యమో, ఆనందమో తెలి[illegible] కాని ఆ పిల్ల కంటినిండా నీరు నిండింది.

* * * *

ప్రకాశ్ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఆలోచనలన్నీ జయగురించే! 'నిన్న ఏదో చెప్పబోయింది జయ! ఏమిటి? మధ్యలో శనిలా ఆనంద్ వచ్చాడు. ఇంతకీ ఏం చెప్పబోయింది జయ?' బుర్ర వేడెక్కింది గాని ఆన్సరీయలేదు. చిన్నగా తలనొప్పి ప్రారంభమయింది.

'ఛ ..ఛ... నాకు బుద్ధిలేదు! నా కెందుకీ ఆలోచనలు విసుక్కుంటున్న ప్రకాశ్ రఘుని చూసి ఆశ్చర్యపోయాడు.

'హలో రఘూ! గుడ్ మార్నింగ్. ఏంటిలా ఒచ్చావు?'

'చాలా ముఖ్యమైన విషయం నీతో తీరికగా మాట్లాడాలని ఒచ్చాను.' రఘు అన్నాడు నవ్వుతూ!

'ముఖ్యమైన విషయమా? నాకేం ముఖ్యవిషయాటాయిరా? కూతురి పెళ్ళా? కొడుక్కి పెళ్ళా?'

'అ_అదే దానిగురించే మాట్లాడదామని వచ్చాను! ప్రస్తుతం చెల్లెలి పెళ్లి చేద్దామని ప్రయత్నం!'

'వెరీగుడ్! ఇంతకీ వరుడెవ్వరో? నే తెలుసుకో వచ్చా?'

'ఎవరో అయితే నీదగ్గర కెందుకు ఒస్తాను! ఆ వరుడు నువ్వే! అందుకే ఇలా వచ్చాను!'

'వాట్?!' 'కుర్చీలోంచి లేచి నిలబడ్డ ప్రకాశాన్ని చెయ్యిపట్టి ఆపేడు రఘు.

'ఎందుకురా? అంత ఆశ్చర్యం?'

'ఎందుకా? తీరికగా ఉదయాన్నే నువ్వు నాతో సరసాలాడుతున్నందుకు! మా అంతకుని, హోదాని మరచినందుకు! ఉద్యోగం సద్యోగం లేని నాకు బంగారు బొమ్మలాటి జయని అంట గడ్డా నన్నందుకు! అర్థమయ్యిందా? లేక ఇంకా వివరంగా చెప్పాలా?

'ఏమిట్రా! ఉదయాన్నే గొడవపడుతున్నారు?' రాజమ్మ వచ్చి ప్రశ్నించేసరికి రఘు కాస్త తేరుకున్నాడు.

'ఏంలేదత్తయ్యగారూ! మా చెల్లిని మీరు చూశారు గదా? ప్రకాష్‌కి దాన్ని ఇద్దామనుకుంటున్నాము. మా ఇంట్లో అందరికీ సమ్మతమే! వీడి ఉద్దేశం కూడా తెలుసుకుంటే మా వాళ్లు మీతో మాట్లాడుదామనుకుంటున్నారు! వీడు చూస్తే అగ్గిబరాటాలా ఎగురుతున్నాడు!'

'వాడి మాటకేం గాని నాయనా! మీరు బాగా ఆలోచించారా? వాడి కింకా ఉద్యోగం ఏదీ రాలేదు కదా? మా స్థితిగతులు కూడా మీకు బాగా తెలుసు! అదీ కాక గారాబంగా పెరిగిన జయమ్మ ఇక్కడేం సుఖపడుతుంది?'

'అత్తయ్యగారూ! మీరు కూడా అలా అంటే ఎలా? మా జయ అదృష్టం బాగుంటే వీడికి వెంటనే మంచి ఉద్యోగం రాకూడదా? అదీకాక మా చెల్లి వీడిని తప్ప చేసుకోనంటుందీ!' ఆఖరి అస్త్రం ప్రయోగించాడు రఘు.

'అయితే ఇంక ఆలోచించడానికి ఏముంది? అయినా నలుగురూ ఆలోచించా మంటున్నారు గదా? మీ ఇష్టం!' అంది ఒక ప్రక్క వచ్చే ఆనందాన్ని అణుచుకుంటూ రాజమ్మ!

'అమ్మా!' అభ్యంతరం చెప్పబోతున్న ప్రకాష్‌ని ఆపాడు రఘు.

'మైడియర్ బావగారూ! చాలు! ఇంకేం అభ్యంతరాలు చెప్పకండి! వస్తా! బై ..' హుషారుగా ఈలవేస్తూ వెళ్తున్న రఘుని చూసి సన్నగా నిట్టూర్చి, 'ఏమిటో ఆ కళ్యాణ ఘడియ ఎప్పుడు, ఎవరికి ఎలా వస్తుందో, తెలీదు గదా? లలితా ఆ కూరల బుట్ట ఇలా తెచ్చిపెట్టు తల్లీ' అంటూ అక్కడే చతికిల బడింది రాజమ్మ.

* * * *

నెల్లాళ్ళలో ముహూర్తాలు పెట్టి, ఘనంగా వివాహం జరిపించారు, ప్రకాశ్, జయలకి.

ముందుబెట్టు చూపి నా జయవంటి అందగత్తె తన భార్య అని నలుగురికీ చూపుతుంటే అదో గర్వంగా ఫీలయ్యేవాడు ప్రకాశ్.

పెళ్ళయిన మరో నాలుగు నెలలకి ఒక పెద్ద కంపెనీలో ప్రకాశ్‌కి ఉద్యోగం వచ్చింది.

కంపెనీ చాలా దూరమని కొత్త స్కూటర్ కొని ప్రజంట్ చేశారు అత్తమామలు.

నెల గిర్రున తిరిగింది. మొదటి జీతం 500 రూ. అందుకున్న ప్రకాశ్ ఆ డబ్బుని ఎలా ఖర్చుపెట్టాలని ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చాక, మేనేజర్ దగ్గర పరిమిషన్ తీసుకుని 3 గం॥ లకే ఆఫీసునుండి బయలు దేరాడు.

మొదట బజారుకి వెళ్ళి అందరికీ కావలసినవన్నీ పాక్ చేయించాడు.

ఇంటికి వచ్చి అలా ఒక పాకెట్ అందించాడు. గదిలో అద్దం ముందు కూర్చుని జడ వేసుకుంటున్న జయ దగ్గరకు వెళ్ళి 'త్వరగా తయారవు, మంచి ఇంగ్లీష్‌పిక్చర్ ఉంది, వెళదాం!' అన్నాడు.

Grams : "SHIVAJITEX" Phone : 23616




T. MARIMUTHU
HANDLOOM WEAVING FACTORY
SELLUR : : MADURAI-2.

టి. మారిముత్తు
హేండ్‌లూమ్ వీవింగ్ ఫాక్టరీ.
సెల్లూరు : : మధురై-2

అలాగే వెళదాం. కానీ......

'కానీల రోజులు వెళ్ళాయి రాణీగారూ, మీ ప్రశ్నకి సమాధానం ఇదిగో' అంటూ రెండు ప్యాకట్లు అందించాడు. జయకి.

థ్యాంక్స్...అంటూ పేకెట్టు విప్పిన జయ ఆనందంతో పొంగిపోయింది.

అబ్బ...ఎంత బాగుందండీ! మీ టేబిల్ మీద ఏం పెడదామా అనుకుంటున్నాను. అని వెంటనే వెళ్ళి నల్లని టేబిల్ క్లాత్ పరచి ఉన్న టేబిల్ మీద తెల్లని రాధా మాధవుల పాలరాతి విగ్రహాన్ని పెట్టింది.

జయా! వాటిని చూసి మురిసిపోదువుగాని తర్వాత తేలిగ్గా, 5½ అవుతోంది. కానీ, త్వరగా, అంటూ రెండవ ప్యాకట్ విప్పి ఆకుపచ్చని అంచున్న చాకలెట్ కలర్ చీర అందించాడు.

మిల మిల మెరిశాయి ఆ సోగ కళ్ళు. ఆ చీరమీదికి మ్యాచయ్యే జాకెట్టు, గాజులు, వగైరాలు తీసుకుని హడావిడిగా గదిలోకి వెళ్ళింది జయ.

మరో పావుగంటలో వారిద్దరినీ తీసుకొని స్కూటర్ బయలుదేరింది హాలు వైపు.

పిక్చర్ చూసి సరదాగా కబుర్లు పడుతూ వస్తున్నారు జయా ప్రకాశ్ లు

10 గంటలకి ఎవరుంటారులే అన్నట్లుగా, బాగా మందు ఎక్కించి ఫుల్‌స్పీడులో వస్తున్న లారీ రయ్‌మని దూసుకువచ్చి స్కూటర్‌నీ ఢీకొంది.

కెవ్వుమని కేక వేశారిద్దరూ.

♦ ♦ ♦ ♦

అన్నయ్యా ఓ అన్నయ్యా........

7 గం. లయింది లేవయ్యా మహానుభావా! కుంభకర్ణుడి నిద్రచూడలేదు గాని, తెల్లగా తెల్లారేక కలవరిస్తూ కేకలువేసే నిన్ను చూస్తున్నాం. లే......లే.

త్రుళ్ళిపడి లేచాడు ప్రకాశ్.

ఎదురుగా తలంటి పోసుకొని కొత్త బట్టలుకట్టి,నిండైన పున్నమ చంద్రుని వంటి ముఖంతో కళ కళ లాడే చెల్లెలని చూశాక గాని తను ఇంతసేపు కలకంటున్నాడని తెలీలేదు ప్రకాశ్ కి.

కాస్త తేరుకుని, 'ఏంటిసంగతి! ఇంతలో సింగారించేవు.'

చిన్న మొట్టికాయ ప్రజంట్ చేస్తూ అడిగేడు. ఇంతసేపూ ఏ లోకంలో ఉన్నావ్! ఈ రోజు నాబర్త్ డే అని మరచిపోయావా? అసలు ఈ రోజునకు ఇంటర్వ్యూ ఉంది కదా ఇంకా పడుకున్నావేంటి?, పైగా కలవరిస్తున్నావు కలలోగానీ ఒదినగారి సాక్షాత్కారంకలిగిందా! ఏం అని అడిగింది చిల్లిపైగా నవ్వుతూ లలిత.

'ఏయ్ లలితా!' నీ పెంకితనం జాస్తీగా ఉంది. వెంటనే బావగారిని తెచ్చి ముక్కుకి తాడు వేయించాలి.' అన్నాడు.

'చాల్లే! త్వరగా కాని టైమవుతుంది' అని లోపలికి వెళ్ళింది లలిత.

త్వరగా కాలకృత్యాలు తీర్చుకుని, సర్టిఫికెట్లు పట్టుకుని రోడ్డెక్కాడు.

జయలాంటి అందమైన పిల్ల ఎక్కడైనా కన్పిస్తుందేమో అని నాలుగుపక్కలా చూస్తున్న ప్రకాశ్ కి. ఎవరూ కన్పించలేదు గాని, 'మిష్టర్! ముందుకి చూసి నడవండి! అన్న హెచ్చరిక మాత్రం ఒక సైకిల్ వాలా దగ్గరనుండి వినిపించింది.

పాపం! ప్రకాశం.




గమనింపుడు! గమనింపుడు!!

మీ మేలుకొరకు గమనింపుడు !!!

మీకు ఆకలి లేకున్నను, జీర్ణశక్తి లేకున్నను, ఎముకలు మాత్రము తెలియుచుండునట్లు, శరీరము కృషించియుండినను. కన్నులు గుంటలు పడినను, ధైర్యము, చురుకుదనము లేకుండినను, శుక్లము బొత్తిగా లేకుండినను, మేహరోగంచేత పీడింపబడి యుండినను మాయొక్క "ఆనంద కుసుమాకర లేహ్యం"మును తెప్పించి పుచ్చుకొందురేని 6 వారములు లోగా వ్యాధులనుండి తప్పించుకొని సౌఖ్యము పొందగలరు.

కేటలాగు ఉచితము. 200 గ్రాములకు రూ 3-50.

మలయాళ మెడికల్ హాల్,(రిజిస్టర్డు)పి.బి. నెం.27,189,వక్కీల్ కొత్తవీధి మధురై (S.I.)